సాక్షి ఆదిలాబాద్

సోమవారం ၊ 29 ၊ జూలై ၊ 2024



అశోక్ రోడ్డులోని పోచమ్మ ఆలయంలో అమ్మవార్లు



హైదరాబాద్‌లోని పోచమ్మ ఆలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఎమ్మెల్యే పూజలు



బోనమెత్తిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో బోనాలతో తరలివస్తున్న మహిళలు

బోనమెత్తి.. మొక్కు తీర్చి

జిల్లావాసులు బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల నడుమ అమ్మవారి ఆలయాలకు చేరుకున్నారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లంగ చూడాలని కోరుకున్నారు. తలమడుగులో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ బోనమెత్తగా.. హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాయల్‌శంకర్ పాల్గొన్నారు. - ఆదిలాబాద్



జిల్లా కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బోనాలతో తరలివస్తున్న మహిళలు



తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో బోనాలతో తరలివస్తూ..



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు



శివసత్తు పూనకం

బోనమెత్తిన యువతి

న్యూస్‌రీల్

31న దివ్యాంగులకు వైద్యపరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు గాను ఈనెల 31న సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు, కొలతలు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 18ఏళ్ల లోపు వారు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

ఆరుగురు ఎస్సైల మ్యూచువల్ బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాకు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆరుగురు ఎస్సైలకు మ్యూచువల్ బదిలీ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న వారు నిజామాబాద్ జిల్లాకు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న వారు జిల్లాకు రానున్నారు. బదిలీ అయిన వారిలో ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో పనిచేస్తున్న జి.నారాయణ, వి.ఉదయ్ కుమార్, డీటీసీలో పనిచేస్తున్న ఎం.విఠల్‌రావు, రూరల్ పోలీసు స్టేషన్‌లో పోస్టింగ్ ఉండి డీటీసీలో పనిచేస్తున్న గోవింద్, మహిళా పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న సంజీవ్‌రావుకు నిజామాబాద్ జిల్లాకు స్థానచలనం కలిగింది. నిజామాబాద్ జిల్లా నుంచి జిల్లాకు చెందిన ఆరుగురు మ్యూచువల్ బదిలీపై రానున్నారు. వీరిలో నిజామాబాద్ మహిళా పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న పద్మ, నిజామాబాద్ వన్‌టౌన్‌లో పనిచేస్తున్న కె.విష్ణుప్రకాశ్, ఆర్మూర్ ఎస్సైలుగా పనిచేస్తున్న అశోక్ కుమార్, అంజమ్మ, బోధన్‌లో పనిచేస్తున్న సి.రామారావు, నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఊశన్న బదిలీ అయ్యారు. అయితే వీరిలో కొంత మంది రిలీవ్ కాగా, మరికొంత మంది రిలీవ్ కావాల్సి ఉంది.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యం

ఆదిలాబాద్: భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్ (ట్రెయిన్ సర్వీస్ నం.17406) రైలు సోమవారం గంటన్నర ఆలస్యంగా బయలుదేరనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. ఆదిలాబాద్ నుంచి సోమవారం రాత్రి 9.05గంటలకు బయలుదేరాల్సిన రైలు రాత్రి 10:35కు బయలుదేరుతుందని పేర్కొంది. విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరింది.

గాండ్రించని బెబ్బులి!



కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్‌లో రెండేళ్లుగా పులి జాడ కానరావడం లేదు. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కథనం.

10లో▸

సర్పంచ్ ఎన్నికలకు సై


- ఓటరు జాబితా సిద్ధం చేయాలని సీఎం ఆదేశాలు
- మాస్టర్ ట్రైనర్లను పంపించాలని ఎస్ఈసీ ఉత్తర్వులు
- రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ..
- పల్లెల్లో మొదలైన ఎన్నికల సందడి



TELANGANA STATE ELECTION COMMISSION

Dated: 27.07.2024

మాస్టర్ ట్రైనర్లను పంపించాలంటూ ఎస్ఈసీ జారీ చేసిన ఉత్తర్వు ప్రతి



మావల గ్రామ ముఖచిత్రం

కైలాస్‌నగర్: సర్పంచ్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ఏడాది జనవరి 31తో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. జీపీలకు కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేపట్టింది. తాజాగా ఆ శాఖ ఉన్నతాధికారులు, బీసీ కమిషన్, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఆగస్టు మొదటి వారంలోపు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో శిక్షణ అందించేందుకు జిల్లా నుంచి ఐదుగురు డాటా ఎంట్రీ ఆపరేటర్లను (మాస్టర్ ట్రైనర్లు)గా ఎంపిక చేసి హైదరాబాద్‌కు పంపించాలని ఎస్ఈసీ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి షూరు కానుంది. పోటీకి సై అంటున్న ఆశావహుల్లో సర్కారు నిర్ణయం ఆనందం కలిగిస్తోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 468 గ్రామ పంచాయతీలుండగా వాటి పరిధిలో 3,830 వార్డులున్నాయి. వీటికి 2018లో ఎన్నికలు నిర్వహించగా ఈ ఏడాది జనవరి 31తో పాలకవర్గాల గడువు ముగిసింది. ఇందులో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి అప్పట్లో ఎన్నికలు జరుగలేదు. దాన్ని మున్సిపాలిటీగా మార్చాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. అయితే ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతం కావడంతో అది సాధ్యపడలేదు. ఐదేళ్లుగా ప్రత్యేకాధికారి పాలననే సాగుతోంది. మరోవైపు ఉట్నూర్‌ను యథావిధిగా గ్రామ పంచాయతీగానే కొనసాగిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ఆదేశాలు జారీ చేసింది. ఇక బేల మండలంలోని కొబ్బాయి పంచాయతీ నుంచి మాంగ్రూడ్ కొత్త జీపీగా ఏర్పడింది. ఎన్నికల సమయం నాటికి కొబ్బాయికి పాలకవర్గ గడువు ఉండటంతో అక్కడ కూడా అప్పట్లో ఎన్నికలు జరుగలేదు. దీంతో ఆయా పంచాయతీల్లో పాలకవర్గాలు లేవు. మరోవైపు మిగతా జీపీల గడువు సైతం ఈ ఏడాది జనవరిలో ముగియడంతో స్పెషలాఫీసర్ల పాలన కొనసాగుతున్న విషయం విదితమే. పంచాయతీలకు ఆరు నెలల పాటు పాలకవర్గాలు లేనట్లైతే కేంద్రం నుంచి అందాల్సిన నిధుల విడుదల నిలిచిపోయే అవకాశముంది. ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధులు అందక పంచాయతీల్లో ఇబ్బందికర పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో జీపీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అవసరమైన కసరత్తు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించింది.

ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి

సచివాలయంలో తాజాగా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి పంచాయతీ ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు మొదటి వారంలోపు గ్రామ, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. రిజర్వేషన్లకు సంబంధించిన ప్రక్రియ సైతం ఆ లోపు చేపట్టాలని సూచించారు. సీఎం ఆదేశాలకనుగుణంగా జిల్లాల్లోని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ అందించేందుకు వీలుగా జిల్లా నుంచి ఐదుగురు డాటా ఎంట్రీ ఆపరేటర్లను మాస్టర్ ట్రైనర్లుగా ఎంపిక చేసి వారి వివరాలు పంపించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన మాస్టర్ ట్రైనర్లకు ఆగస్టు 2వ తేదీన ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ఆధారంగా గ్రామాల్లో ఓటరు జాబితాలను ప్రకటించి వార్డుల వారీగా సిద్ధం చేయనున్నారు. పంచాయతీ ఓటర్లు 650లోపు ఉన్నట్లైతే ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్నారు. 200 మందికి రెండు, 400 మందికి మూడు, 400–650 మందికి నాలుగు, 650కి మించితే మరో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లుగా తెలుస్తోంది. గతంతో పోల్చితే వార్డు స్థానాల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

ఓటర్ల జాబితా సిద్ధమయ్యాక రిజర్వేషన్ల ఖరారు, బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సిబ్బంది వంటి ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. అయితే రిజర్వేషన్లకు సంబంధించి బీసీ కమిషన్ నిర్దిష్ట గడువు ఎంచుకొని ఆ లోపు నివేదిక అందించాలని సీఎం ఆదేశించారు. అయితే బీసీల కులగణన ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయడం ఇప్పట్లో సాధ్యమయ్యే అవకాశముండదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తారా లేక రిజర్వేషన్లు మారుస్తారా అనే దానిపై ఆశావహులతో పాటు రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దీనిపై స్పష్టత నిచ్చే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు పల్లెల్లో సందడి మొదలైంది. ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

రుణమాఫీ.. గందరగోళం

- 'తొలివిడత' అర్హులకు ఖాతాల్లో నిధులు ఇంకా జమ కాలే..
- అన్నదాతకు తప్పని ఎదురుచూపు
- అధికారుల్లో స్పష్టత కరువు

రైతుల ఖాతాలు : 18,821

కుటుంబాలు : 18,353

రుణమాఫీ నిధులు : రూ.120.79 కోట్లు



తలమడుగులోని మహారాష్ట్ర బ్యాంక్‌లో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ఇటీవల రుణమాఫీ ప్రకటించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమైంది. అయితే కొంత మంది రైతులకు మాత్రమే డబ్బులు జమ కాగా, మిగతా వారికి సగం కంటే తక్కువ, ఇంకొంత మందికి అసలుకే రాక బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నోడల్ అధికారిని నియమించినప్పటికీ వారి నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్ష వరకు రుణం తీసుకున్న వారికి తొలివిడతలో ప్రభుత్వం రుణమాఫీ డబ్బులను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో మొదటి విడత 18,821 మంది రైతులకు రూ.120.79 కోట్ల నిధులను విడుదల చేసింది. అయితే జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ ఖాతాలో మాత్రం డబ్బులు జమ కాకపోవడంతో పలువురు ఆందోళనకు గురవుతున్నారు. మరో మూడు రోజుల్లో రెండో విడత డబ్బులు సైతం ప్రభుత్వం విడుదల చేసే ఆలోచనలో ఉందని అధికారులు చెబుతున్నారు.

అయోమయంలో అన్నదాత

రుణమాఫీ డబ్బులు ఖాతాలో జమకాకపోవడం విషయమై స్పష్టత ఇచ్చే అధికారులు లేకపోవడంతో సంబంధిత రైతులు అయోమయానికి గురవుతున్నారు. అర్హులైన వారి వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే.. టుబి ప్రాసెస్, డాటా నాట్‌ఫౌండ్, నో రేషన్ కార్డు.. అని సమాధానం వస్తుందని పేర్కొంటున్నారు. ఫ్యామిలీ గ్రూప్‌గా చేయలేదని, ఆధార్ నాట్ మ్యాచ్, రుణం తీసుకున్న వ్యక్తి చనిపోయారని.. ఇలా అనేక రకాల కారణాలను చూపుతున్నారు. అయితే వీటి పరిష్కారం కోసం ఏం చేయాలో మాత్రం అధికారులు చెప్పకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. చేను పనులు వదిలేసి మండల కార్యాలయం, బ్యాంకులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. జిల్లాలో తొలివిడతలో దాదాపు 10వేల మంది ఖాతాల్లో ఇంకా డబ్బులు పూర్తిస్థాయిలో జమ కాలేదని తెలుస్తోంది.

ఈ బ్యాంకుల రైతులకు కష్టాలు..

జిల్లాలో 15వరకు ప్రధాన బ్యాంకులు, 50 వరకు వాటి బ్రాంచీలు ఉన్నాయి. మొదటి విడతలో రుణమాఫీకి సంబంధించి జిల్లాలో 18,821 ఖాతాలు ఉండగా, ఇందుకు సంబంధించి 18,353 కుటుంబాలు ఉన్నాయి. రూ.120.79 కోట్ల సొమ్మును ప్రభుత్వం మాఫీ చేసింది. మహారాష్ట్ర బ్యాంకుకు సంబంధించి నాలుగు బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటిలో రుణం తీసుకున్న రైతుల వివరాలు తప్పుల తడకగా ఉండడంతో వారి ఖాతాల్లో ఇప్పటివరకు జమ కాలేదు. కొందరికి తక్కువ మొత్తంలో డబ్బులు జమ అయ్యాయి. దాదాపు 4వేల నుంచి 5వేల మంది రైతుల్లో ఈ బ్యాంకులో రూ.లక్ష వరకు రుణాలు తీసుకొని ఉన్నారు. అయితే వారికి రూ.10వేలు, రూ.20వేలు మాత్రమే జమ అవ్వడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకు అధికారుల నుంచి వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అలాగే ఇండియన్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్‌లలో రుణం తీసుకున్న రైతులకు ఒక్కరికి కూడా రుణమాఫీ జరగలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇండియన్ బ్యాంక్‌లో అలహాబాద్ విలీనమైంది. దాదాపు 200 నుంచి 500 వరకు ఖాతాలు ఉంటాయి. ఈ వివరాలను సైతం అధికారులు ప్రభుత్వానికి పంపించారు. కెనరా బ్యాంకు రైతుల పరిస్థితి అదేవిధంగా ఉంది. సాంకేతిక కారణాలతో రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని తెలుస్తోంది. సహకార బ్యాంకులో రుణం తీసుకున్న కొంత మంది రైతులకు డబ్బులు జమ కాగా, మిగతా వారికి డబ్బులు కాలేదు. అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం రావడం లేదని రైతులు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం

రుణమాఫీ డబ్బులు జమ కాని రైతులు ఏఈవో, ఏవోల వద్దకు వస్తున్నారు. అలాంటి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్నాం. ఏ సమస్య ఉందో వారికి తెలియజేస్తున్నాం. మహారాష్ట్ర, కెనరా, ఇండియన్ బ్యాంకులకు సంబంధించి సాంకేతిక కారణాలతో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానట్టుగా గుర్తించాం. ఇలాంటి రైతుల వివరాలతో నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం.

– రమేశ్, రుణమాఫీ నోడల్ అధికారి, ఆదిలాబాద్

భవనమెక్కిన ఆవు





ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఓ ఆవు నిర్మాణంలో ఉన్న రెండంతస్తుల భవనం పైకి ఎక్కింది. సైడ్‌వాల్స్ లేకపోవడంతో ప్రమాదం వాటిల్లుతుందని గమనించిన స్థానికులు గోమాత ఫౌండేషన్ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని ఆవును సురక్షితంగా కిందికి దించారు. ఫౌండేషన్ సభ్యులు సురేశ్, హిమాన్షు, రాజును పలువురు అభినందించారు.



పెన్‌గంగకు జలకళ

జైనథ్: జిల్లాతోపాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగ పొంగి ప్రవహిస్తోంది. పక్షం రోజుల క్రితం నీళ్లు లేక వెలవెలబోయిన నది ప్రస్తుతం వరద జలకళ సంతరించుకుంది. కామాయి వద్ద పూర్తిస్థాయిలో ప్రవహిస్తూ చూపరులను ఆకట్టుకుంటుంది.

క్లుప్తంగా

ఆలయంలో చోరీకి విఫలయత్నం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బేల్లూరి అయ్యప్ప ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ విషయంపై ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్‌ని సంప్రదించగా ఆలయం తాళం పగులగొట్టి లోనికి వెళ్లగా అక్కడ ఎలాంటి వస్తువులు దొరకలేదు. ఆలయ ఆవరణలో హుండీకి వెల్డింగ్ చేసి ఉండడంతో అందులో ఎలాంటి నగదు తీసుకెళ్లలేదని పేర్కొన్నారు.

చాందా (టి) వంతెన సమీపంలో..

చాందా(టి) వంతెన సమీపంలో శనివారం రాత్రి ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ చీకట్లో ఉండి తాడును రోడ్డుకు అడ్డంగా కట్టి వాహనదారులను కిందపడేలా చేస్తున్నారని తెలిసింది. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఫణిధర్ అక్కడికి చేరుకుని విచారణ చేపడుతున్నారు.

108లో ప్రసవం

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామానికి చెందిన గర్భిణి జాట్వే కిరణ్‌బాయికి ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా 108 అంబులెన్స్‌కి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను పీహెచ్‌సీకి తీసుకెళ్తున్నారు. మార్గమధ్యన చింతలసాంగ్వి సమీపంలో పురిటినొప్పులు ఎక్కువ అయ్యాయి. అంబులెన్స్‌ను అక్కడే నిలిపి ఈఆర్‌సీపీ డాక్టర్ సంజయ్‌కుమార్ సూచనలతో ఈఎంటీ రవీందర్ గర్భిణికి ప్రసవం చేశారు. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని మెడికల్ ఆఫీసర్ శిల్ప తెలిపారు. పైలట్ రాజారాం పాల్గొన్నారు.

ముగ్గురి రిమాండ్

ఇంద్రవెల్లి: అదనపు వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్యకు కారకులైన భర్త, అత్తమామలను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దనోర (బి)గ్రామానికి చెందిన అనసూయని ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన శివాజీతో ఆరేళ్ల క్రితం పెళ్లి జరిగింది. కట్నం కానుకల కింద 5 తులాల బంగారు ఆభరణాలు, ఇంటి సామగ్రి అందించారు. కొంతకాలం తర్వాత రూ.20 వేల అదనపు కట్నం తేవాలని అత్తమామలు అంగద్, దైవబాయి, భర్త శివాజీ ఆమెని మానసికంగా వేధించసాగారు. భరించలేని ఆమె ఈనెల 26న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె ఆత్మహత్యకు కారకులైన భర్త, అత్తమామలను ఆదిలాబాద్ జైలుకు రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి ప్రోగ్రామ్‌కి ఎంపిక

బోథ్: 'సకురా సైన్స్ ప్రోగ్రాం జపాన్'కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని రసజ్ఞ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమేష్‌రావ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటారని వివరించారు. ఆదిలాబాద్‌లో సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ, జిల్లా సైన్స్ అధికారి రఘురాంలు రసజ్ఞకు ఎంపిక పత్రాన్ని అందజేశారు.

గాండ్రించని బెబ్బులి!



- కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్‌లో ఆగని పులి
- రెండేళ్లుగా కానరాని టైగర్ జాడ
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

జన్నారం: జీవ వైవిధ్యంలో పులి పాత్ర గొప్పది. దట్టమైన అడవులు ఉన్నచోట పులులు ఉంటాయి. పులుల సంతతిని పెంచడంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రెండో టైగర్ జోన్‌గా కవ్వాల్ టైగర్‌జోన్‌ను ఏర్పాటు చేశారు. దట్టమైన అడవులు, సరిపడా వన్యప్రాణులు, పది పులులు స్వేచ్ఛగా ఉండేందుకు వీలుగా అడవులు.. ఇన్ని సౌకర్యాలున్నా పులి రాకపోకలతో సరిపెడుతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని కాగజ్‌నగర్ ప్రాంతంలో ఆరు పులులకు గాను రెండు మృత్యువాత పడ్డాయి. ఒకటి వేరే ప్రాంతానికి తరలివెళ్లగా కేవలం మూడు పులులు ఉన్నట్లు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కవ్వాల్ అభయారణ్యం దట్టమైన అడవులు, వివిధ రకాల వన్యప్రాణులకు నెలవు. చెంగుచెంగున ఎగిరే వన్యప్రాణులు, జలజల సవ్వడి చేసే జలపాతాలు.. కిలకిల రావాలు పలికే పక్షులు.. వీటన్నింటి కలబోత. కేంద్ర ప్రభుత్వం 2012 ఏప్రిల్ 10న కవ్వాల్ అభయారణ్యాన్ని పులుల రక్షిత ప్రదేశంగా ఏర్పాటు చేసింది. ఈ అభయారణ్యంలో 893 చదరపు కిలోమీటర్లు కోర్ ఏరియాగా, 1,123 చదరపు కిలోమీటర్లు బఫర్ ఏరియాగా ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాల నుంచి ఆరు డివిజన్లుగా విభజించి చేసి కవ్వాల్ సర్కిల్ ఏర్పాటు చేసింది. ఈ అడవుల్లో పులికి ఇష్టమైన దుప్పులు, కొండగొర్రెలు, మేకాలు, నీలుగాయిలు, సాంబర్లు, చుక్కల దుప్పులు, అడవి పందులులాంటి శాఖహార జంతువులు, చిరుతలు, ఎలుగుబంట్లు, అడవికుక్కలు, నక్కలు, తోడేళ్ల వంటి మాంసాహార జంతువులు ఆవాసం ఉంటున్నాయి. శాఖాహార జంతువుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా ఇక్కడ పులి రాక ప్రశ్నార్థకంగా మారింది.

రెండేళ్లుగా కానరాని పులి

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం, ఖానాపూర్, ఉట్నూర్, ఆసిఫాబాద్ డివిజన్లలో పులి పలుమార్లు రాకపోకలు సాగించింది. కవ్వాల్ టైగర్ జోన్ పరిసర పరిధిలో తిప్పేశ్వర్, తాడోబా, ఇంద్రావతి టైగర్‌జోన్‌లు ఉన్నాయి. ఆయా టైగర్‌జోన్‌ల గుండా పులులు కవ్వాల్ టైగర్‌జోన్‌లోకి రాకపోకలు సాగించాయి. 2016 నుంచి 2022 వరకు దొంగపల్లి, అలీనగర్, ఖానాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కెమెరాకు పులి చిక్కింది. అలీనగర్, దొంగపల్లి ప్రాంతాల్లో పలు పశువులను కూడా వేటాడింది. కానీ ఎందుకో ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. 2022లో ఖానాపూర్ డివిజన్‌లో పర్యటించిన పులి ఆతర్వాత కెమెరాలకు చిక్కడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

పులి ఆవాసం కోసం అభివృద్ధి

కవ్వాల్ టైగర్‌జోన్‌లో అత్యధికంగా అడవి, ఆవాస యోగ్యం, వన్యప్రాణులున్న ప్రాంతం జన్నారం అటవీ డివిజన్. టైగర్‌జోన్‌లో 22 శాతం మాత్రమే జన్నారం డివిజన్‌లో ఉంది. పులి ఆవాసం కోసం అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించారు. ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంపా స్కీం కింద సుమారు రూ.6.30 కోట్లు, సెంట్రల్ ఫండ్ ద్వారా రూ. 2 కోట్లకు పైగా నిధులు వెచ్చించినట్లు తెలిసింది. ఈ నిధులతో అడవుల్లో కుంటల నిర్మాణం, గడ్డి క్షేత్రాలు, సాసర్ వెల్స్, బేస్‌క్యాంపులు, ఎనిమల్ ట్రాకర్స్ నిర్వహణ, తదితర అభివృద్ధి పనులతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. నాలుగేళ్లలో 900 హెక్టర్లలో గడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూడా 250 హెక్టర్లలో గడ్డిక్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తత్ఫలితంగా జన్నారం అటవీ డివిజన్‌లో రెండేళ్లలో పులికి ఆహారమైన వన్యప్రాణుల సంఖ్య రెట్టింపైంది.

కారణాలెన్నో...

పులి చాలా బరువైన జంతువు. తేలిగ్గా వేటాడేందుకు ఇష్టపడుతుంది. అందుకే గడ్డి మాటున వన్యప్రాణులను చూసి వాటిపై దూకి వేటాడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. జన్నారం డివిజన్‌లో దట్టమైన టేకు వనం ఉంది. గుబురైన పొదలు, పలు రకాల చెట్లు ఉండటం వల్ల పులి వేటకు అడ్డుపడే అవకాశం ఒక కారణమని చెప్పవచ్చు. అదే విధంగా పులికి అలజడి లేకుండా ఉంటేనే ఇక్కడ ఉండే అవకాశం ఉంది. జన్నారం పరిసర ప్రాంతాల్లోని పశువులు మేత కోసం అడవిలోకి వెళ్తాయి. ఆ శబ్దానికి అలజడి పెరిగి పులి వేరే ప్రాంతానికి తరలివెళ్లే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

విరివిగా గడ్డి క్షేత్రాలు



పులులు ఆవాసంగా ఉండాలంటే వన్యప్రాణుల సంఖ్య పెరగాలి. అందుకే ఇక్కడ కొన్నేళ్లుగా గడ్డి పెంపకం చేపడుతున్నాం. అడవిలో ఎలాంటి అలజడి లేకుండా ఇప్పటికే రెండు గ్రామాలకు పునరావాసం కల్పించాం. ఆ ప్రాంతాల్లో గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచుతాం. పులుల సంఖ్య పెంచడంలో అందరి సహకారం కావాలి. అందుకే పులితో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలకు ఉపాధి చూపిస్తూ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తాం.

– శివ్ ఆశిష్ సింగ్, డీఎఫ్‌వో, మంచిర్యాల

కుమురంభీం జిల్లాలో పులి అలికిడి

- రక్షణకు కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ఆసిఫాబాద్ అడవులు

చింతలమానెపల్లి: 2010లో రష్యాలోని సెయింట్ పీటర్‌బర్గ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పులుల సంరక్షణ సమావేశంలో జూలై 29వ తేదీని అంతర్జాతీయ పులుల దినోత్సవంగా ప్రకటించారు. పులి ఆవాసాలను సంరక్షించేందుకు చర్యలు చేపట్టడం, పులి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పులుల మనుగడను కాపాడి వాటి సంఖ్య పెంచేందుకు కృషి చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. ఆయా సంస్థలు, ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో దేశవ్యాప్తంగా పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2006లో దేశంలో 1,411 పులులు ఉండగా 2010లో 1706, 2014లో 2,226, 2019లో 2,967, 2023లో 3,167 పులులు ఉన్నట్లు గుర్తించారు.

కుమురంభీం జిల్లాలో మనుగడ

కుమురం భీం జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్లు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో 917 చదరపు కిలోమీటర్లు, ఆసిఫాబాద్ డివిజన్‌లో 1518 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 5 అటవీ రేంజ్‌లు, ఆసిఫాబాద్ డివిజన్‌లో 5 అటవీ రేంజ్‌లు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లోని ఏడు మండలాల పరిధిలో 115, ఆసిఫాబాద్ డివిజన్‌లో 55 చదరపు కిలోమీటర్లు దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. జిల్లాకు సరిహద్దుగా మహారాష్ట్ర ఉండగా మూడువైపులా అభయారణ్యాలు ఉన్నాయి. తాడోబా పులుల అభయారణ్యం, భామ్రాగఢ్, తిప్పేశ్వర్ అభయారణ్యాలు ఉండగా మరో వైపు తెలంగాణ అటవీ పరిధిలోని కవ్వాల్ పులుల అభయారణ్యం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆయా అటవీ రేంజ్‌ల పరిధిలో సుమారుగా 8 పెద్ద పులులు సంచరిస్తున్నాయని, మరో మూడు పులులు రాకపోకలు సాగిస్తున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

అమ్మవారికి బోనం సమర్పించి..



బోనం సమర్పిస్తున్న దుకాణాదారులు

బాసర: బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలోని మహంకాళి అమ్మవారికి దేవస్థానం పరిధిలోని దుకాణాదారులు ఆదివారం బోనాలు సమర్పించారు. సరస్వతి, మహాలక్ష్మి, మహంకాళి అమ్మవారికి బోనం, పుట్టింటి సారెను అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. సీహెచ్ నాగరాజు, అంతగిరి మాధవ్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మహేంద్ర

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ వాసి రాథోడ్ మహేంద్ర నాయక్‌కు స్వర్ణ నంది పురస్కారం లభించింది. సామాజిక సేవా కార్యక్రమాలు, వివేకానంద యువజన సంఘం సభ్యుడిగా చేసిన ఉత్తమ సేవలకుగాను ఆదివారం హైదరాబాద్‌లో మెగా ఇంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఆయన ఈ పురస్కారం అందుకున్నారు.

అనుమానాస్పదంగా లారీడ్రైవర్ మృతి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో ఆదివారం ఓ లారీడ్రైవర్ అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ మారుతి హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు ఓ బిల్డింగ్ మెటీరియల్‌ని లారీలో తీసుకువచ్చాడు. స్థానిక సోఫీనగర్‌లోని ధర్మాకాంట వద్ద రోడ్డు పక్కన ఆపాడు. కొద్దిసేపటికి లారీ క్యాబిన్‌లో డ్రైవర్ మృతిచెందడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాతికేళ్ల తర్వాత 'సరస్వతి' చెంతకు



సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

- మధుర స్మృతులు నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు
- సరస్వతి శిశుమందిర్‌లో అ'పూర్వ'సమ్మేళనం
- గురువులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: చిన్ననాడు బడిలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత మళ్లీ చదువులమ్మ ఒడిలో కలిశారు. పదో తరగతి పూర్తయ్యాక ఎవరిదారిలో వారు వెళ్లారు. ఉన్నత చదువులు చదివి కొందరు ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొందరు వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 25 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనం అనంతరం చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఆదివారం ఈ అపురూప ఘట్టానికి ఆదిలాబాద్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల వేదికైంది. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతోపాటు మధుర జ్ఞాపకాలను సెల్‌ఫోన్లు, కెమెరాల్లో బంధించారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గురువులకు సన్మానం

బాల్యంలో చదువుకున్న బడి, తరగతి గదులు, గురువులను గుర్తుంచుకొని వారిని పూర్వ విద్యార్థులు పలుకరించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. నాడు చెప్పిన చదువులతోనే తాము ఈ స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. వీరందరిని ఒక చెంత చేర్చేందుకు నెలరోజులుగా పూర్వ విద్యార్థులైన సాయికృష్ణారెడ్డి, సంతోశ్, సురేశ్, సునీల్, రచన, హరిత, వాణిశ్రీ, మమత, విజయ తదితరులు ఎంతగానో కృషి చేశారు.

ఎప్పటికీ మరువలేను



పాఠశాలలో చదివిన చిన్ననాటి మధుర స్మృతులను ఎప్పటికీ మరువలేను. పాతికేళ్ల తర్వాత బాల్య మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. తోటి స్నేహితులను కలిసేందుకు వచ్చాను. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నాం.

– డాక్టర్ విజయ, అనస్తీషియా, భైంసా

ఆనందంగా ఉంది



చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సంతోషానికి హద్దులు లేకుండా పోయింది. చిన్ననాటి నుంచి ఈ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాను. 25 ఏళ్ల తర్వాత స్నేహితులు పూర్వ సమ్మేళనం ఉందని చెప్పడంతో ఇక్కడికి వచ్చాను.

– శివప్రసాద్, వైద్యారోగ్య శాఖ ఉద్యోగి

బాల్యం ఉంటే బాగుండు..



పాఠశాలలో శిశు తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివాను. ఇక్కడ నేర్చుకున్న సంస్కృతి, సంప్రదాయాలు ఎప్పటికి మరిచిపోలేను. ఇక్కడికొచ్చి చిన్ననాటి స్నేహితులతో కలిసినప్పుడు బాల్యముంటేనే బాగుండూ అనిపిస్తోంది.

– నితీష్‌సింగ్, విద్యుత్ ఏఈ, పోచంపాడ్

పాఠశాల చదువు ఎంతో దోహదం



మాది 1998-99వ బ్యాచ్. పాఠశాలలో చదువుకున్నాం. ఇక్కడ విద్యాబోధన మాకు ఎంతో దోహదపడింది. సంస్కృతి, సంప్రదాయాలకు శిశుమందిరాలు నిలయాలు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మరువలేం. ఒకేచోట ఇలా అందరూ కలవడం చాలా ఆనందంగా ఉంది.

– దీపక్ సింగ్, కానిస్టేబుల్ భైంసా

ఇక నుంచి టచ్‌లో ఉంటాం..



చిన్ననాడు కలిసి చదువుకున్న స్నేహితులందరు ఇలా కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఇకపై అందరూ టచ్‌లో ఉంటాం. రోజంతా గడపడం ఓ వేడుకలా అనిపించింది. అందరి ఫోన్ నంబర్లు తీసుకున్నాం. నేను హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. ప్రైవేట్ పాఠశాలను నడిపిస్తున్నాను.

– రచన, టీచర్

లోన్ పేరిట ఫైనాన్స్ కంపెనీ టోకరా?

- మహిళల పేరుతో తమ ఖాతాల్లోకి నగదు బదిలీ చేసుకున్న ఉద్యోగులు
- సెల్‌ఫోన్ మెసేజ్‌తో విషయం వెలుగులోకి..
- ఇచ్చోడలోని ఓ ఫైనాన్స్ కంపెనీ నిర్వాకం

బోథ్: మహిళలకు లోన్ ఇస్తామని ఓ ప్రైవేట్ కంపెనీ టోకరా వేసిన ఘటన ఇచ్చోడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మహిళల పేరుతో కంపెనీ ఉద్యోగులు తమ ఖాతాల్లో నగదు బదిలీ చేసుకున్నారు. సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహిళలతో కూడిన గ్రూప్‌నకు లోన్ ఇస్తామని ఫైనాన్స్ కంపెనీ ప్రచారం చేశాయి. బోథ్ మండలం సొనాల, నేరడిగొండ మండలం తర్నంతోపాటు పలు గ్రామాల్లో కొందరు మహిళలు ఐదుగురు సభ్యులతో గ్రూప్‌గా ఏర్పడి దరఖాస్తు చేసుకున్నారు. వారి ఆధార్, పాన్‌కార్డు, ఫొటోలు, వేలిముద్రలను సదరు నిర్వాహకులు తీసుకున్నారు. కొన్నిరోజులు గడిచాక లోన్ రాలేదని చెప్పారు. ఫైనాన్స్ కంపెనీ నుంచి లోన్ అకౌంట్ ద్వారా రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు నగదు బదిలీ అయినట్లు మహిళల సెల్‌ఫోన్లకు మెసేజ్ వచ్చింది. ఈ విషయమై ఫైనాన్స్ కంపెనీ వద్దకు వెళ్లి అడుగగా మెసేజ్‌లు అలాగే వస్తాయని, లోన్ రాలేదని నిర్వాహకులు నమ్మబలికారు. కొందరికి అనుమానం వచ్చి కంపెనీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తమ పేరిట వచ్చిన లోన్ నగదును ఉద్యోగులు తమ అకౌంట్లలోకి బదిలీ చేశారని మహిళలు ఆరోపిస్తున్నారు. తమను మోసం చేసినవారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పేరుకే జిల్లా ఆసుపత్రి

- ఉట్నూర్‌లో వెక్కిరిస్తున్న ఖాళీ పోస్టులు
- నామమాత్రంగా వైద్యసేవలు
- అత్యవసరమైతే రిమ్స్‌కు రెఫర్



ఉట్నూర్‌లోని జిల్లా ఆసుపత్రి

ఉట్నూర్‌రూరల్: అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా తయారైంది ఉట్నూర్‌లోని వంద పడకల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించినా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రత్యేక వైద్య నిపుణులు, వైద్యులు, నర్సుల పోస్టులు ఖాళీగా వెక్కిరిస్తున్నాయి. ప్రతీరోజు 400 మంది ఓపీలు, 50 నుంచి 60 ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. సరిపడా వైద్యులు లేక గంటల తరబడి క్యూలో ఉంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, ఇంద్రవెల్లి, కుమురంభీం జిల్లా జైనూర్, నార్నూర్, సిర్పూర్(యూ) మండలాలు, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఇక్కడ వైద్యులు లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇక పెద్ద ప్రమాదాలు, ప్రసవాలు, అత్యవసరమైతే ఆదిలాబాద్ రిమ్స్‌కు, ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

బదిలీపై వెళ్లినా.. భర్తీ కాని పోస్టులు

19 మంది స్టాఫ్‌నర్సులు ఇటీవల బదిలీపై వెళ్లగా ఆ స్థానాలు భర్తీ కాకపోవడంతో కేవలం 13 మంది నర్సులే ఉన్నారు. ప్రత్యేక వైద్యనిపుణులతో కలిపి 17 మంది డాక్టర్లు అవసరం ఉండగా కేవలం ఆరుగురు డాక్టర్లే విధులు నిర్వర్తిస్తున్నారు. వందలాది రోగులకు సేవలు అందించలేక ఇటు వైద్యులు, అటు సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. ఇదిలా ఉంటే, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, అస్తమాలజీ, అనస్తీషియా, డెంటల్, ఎండీ, ఫోరెన్సిక్ ప్రత్యేక వైద్య నిపుణులు బదిలీపై వెళ్లారు. ఆ స్థానాలు భర్తీ కాలేదు. బదిలీపై వైద్య సిబ్బంది, వైద్యులు ఇక్కడికి రావడానికి విముఖత చూపుతున్నారని తెలుస్తోంది. ఎన్‌ఆర్‌సీ, ఎస్‌ఎన్‌సీయూలో వైద్యులు లేక డిప్యూటేషన్లపై నియమించి సేవలను నామమాత్రంగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యులు, నర్సుల పోస్టులు భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పోస్టులు భర్తీచేయాలి



మారుమూల ప్రాంతాల ఆదివాసీలు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారు. వైద్యులు లేకపోవడంతో వారికి ఇబ్బందిగా ఉంది. ఖాళీ వైద్య పోస్టులు భర్తీ చేసి ఆదివాసీలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

ఉన్నతాధికారుల దృష్టికి..



ఆసుపత్రిలో వైద్యులు, నర్సుల ఖాళీ పోస్టులు ఉన్న విషయం విదితమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో సేవలు అందిస్తున్నాం. త్వరలో పూర్తిస్థాయిలో వైద్యులు, నర్సులను నియమిస్తాం.

– ఉపేందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు



నిందితులతో పోలీసులు

ముధోల్ : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకున్నామని సీఐ మల్లేశ్ తెలిపారు. వారివద్ద నుంచి 443 గ్రాముల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆయన కథనం ప్రకారం.. పక్కా సమాచారంతో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై సాయికిరణ్, బాసర ఎస్సై గణేశ్, సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి మండల కేంద్ర సమీపంలో ప్రైవేట్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి వీరిని చూసి బైక్‌పై పారిపోవడానికి ప్రయత్నించగా చాకచక్యంగా పట్టుకున్నారు. భైంసా వాసి షేక్ అర్షెడ్ గుర్తించారు. గంజాయి ఎక్కడి నుంచి తెచ్చారనే వివరాలు తెలుసుకున్నారు. బాసర మండలం బిద్రెల్లికి వెళ్లి అక్కడ మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన సయ్యద్ దిల్దరెల్లిని పట్టుకుని విచారించారు. 15 రోజులకోసారి గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి నాందేడ్ జిల్లా పర్భాని ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసే వాడినని తెలిపాడు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు. ఇద్దరిని పట్టుకున్న ప్రత్యేక టీమ్‌ను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.